4.3.2000 సాయంత్రం సాయికుల్వంత్ సభా మండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశం

# ఆత్మ : పంచ కోశములు

ప్రేమస్వరూపులారా! సర్వ భూతములందున్న ఆత్మ, తనయందున్న ఆత్మ ఒక్కటే అని గుర్తించిన వ్యక్తి తాను విరాగియైనను, గృహస్థుడైనను, కర్మలు చేసినను, చేయకపోయినను ఎప్పుడూ దైవంతో ఏకమై ఆనందాన్ని అనుభవిస్తుంటాడు. వేద, శాస్త్రాలను వల్లించినంత మాత్రాన, ఇతిహాసములను తిరగవేసినంత మాత్రాన, ఆధ్యాత్మిక ప్రసంగాలను శ్రవణం చేసినంత మాత్రాన ఆత్మతత్త్వం అనుభూతికి రాదు. చిన్న విత్తనమునందు విశాలమైన వృక్షం ఇమిడియున్నట్లుగా, ఈ బ్రహ్మాండమంతయు అణుస్వరూపమైన ఆత్మయందే ఇమిడియున్నది.

ప్రేమస్వరూపులారా! మీరు ఆనందమయులు. కాని మీ స్వస్వరూపమైన ఆనందాన్ని మరచి ఆనందంకోసం ఆరాటపడుతున్నారు. మీరే ఆనందమయులైయుండగా తిరిగి ఆనందకోసం ప్రపంచమందు వెతకటం ఎంత అజ్ఞానం! ఇంతకు ముందు ప్రసంగించిన ఇరువురు వైస్ చాన్స్‌లర్లు పంచకోశములను గురించి విపులంగా వివరించమని స్వామిని ప్రార్థించారు. ఏమిటా పంచకోశములు? శరీరము భౌతికమైన, ప్రాకృతమైన అన్నమయకోశము. ఈ స్థూల శరీరం కర్మేంద్రియ, జ్ఞానేంద్రియములచేత కూడియుండుటచేత వేదము దీనికి 'విశ్వుడు' అని పేరు పెట్టింది. ఇది సర్వ విషయములందు వ్యవహరించటం చేత దీనికి 'వ్యావహారికుడు' అని రెండవ పేరు పెట్టింది. ప్రాణము, మనస్సు, విజ్ఞానము కంటికి కనిపించవు కాబట్టి, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయములను మూడింటినీ కలిపి 'సూక్ష్మశరీరము' అని పిలిచింది. మనస్సు కంటికి కనిపించదుగాని, అనంతంగా వ్యాపించియుంది. ఇంక, ఆనందమయ కోశము కారణ స్వరూపము. దీనికి ఆనందమయ కోశమని పేరు పెట్టారుగాని, దీనిలో ఆనందం లేదు. ఇది సుషుప్తికి సంబంధించినది. దీని తరువాతదే తురీయావస్థ. అదియే నిజమైన ఆనందము. అది ఇంద్రియములకు, మనస్సుకు, బుద్ధికి అతీతమైన ఆనందము. దీనినే పారమార్థికమన్నారు. తురీయావస్థయందు కలిగిన ఆనందమే నిజమైన ఆనందము. ఇట్టి ఆనందము మీకు అనుభూతికి రాకుండా పంచ క్లేశములు అడ్డుపడుతున్నాయి.

**పంచక్లేశములు**

మొదటిది అవిద్యా క్లేశము, రెండవది అభినవక్లేశము, మూడవది అస్థిత క్లేశము, నాల్గవది

srisathyasaivachanamrutam

రాగక్లేశము, ఐదవది ద్వేష క్లేశము. ఈ పంచక్లేశముల వల్లనే మానవుడు ఆత్మకు అత్యంత దూరమైపోతున్నాడు, ఆత్మదర్శనం చేసుకోలేకపోతున్నాడు, ఆత్మానందాన్ని అనుభవించలేకపోతున్నాడు. ఈ పంచ క్లేశములు పాంచభౌతిక శరీరమునకు అనేక ఇబ్బందులు కలిగిస్తున్నవి. దేహాన్ని అమితంగా ప్రేమించి, దాని నిమిత్తమై జీవితాన్ని ధారపోయటమే అవిద్యాక్లేవము. ఇది మానవునికి అనేక ఆశలను, రోగాలను కల్పించి, జీవితాన్ని దుఃఖమయం గావిస్తుంది. సర్వమునకు మనస్సే కారణమని తెలుసుకోలేక కంటికి కనిపించే దృశ్యమే ప్రధానమని భావించటం అభినవ క్లేశము. మనస్సును అరికట్టలేక, దేహభ్రాంతిని వీడలేక మానవుడు దుఃఖాన్ని అనుభవిస్తాడు. విషయ భోగములందు ఆసక్తియే అస్థిత క్లేశము. ధన, కనక, వస్తు, వాహనాదులు కావాలని అభిలషించటమే రాగక్లేశము. అది మానవుణ్ణి అనేక విధములైన బాధలకు గురి చేస్తుంది. ఇంక ద్వేష క్లేశమనగా ఏమిటి? మానవుడు కొన్ని కోరికలతో ఇతరులను ఆశ్రయించి, కోరికలు తీరితే సంతోషిస్తాడు; కోరికలు తీరకపోతే వారిని ద్వేషిస్తాడు. కేవలం సామాన్య మానవులు మాత్రమే కాదు, అనేకమంది భక్తులుకూడా భగవంతుణ్ణి ఎన్నో ఆశలతో ఆరాధన సల్పుతుంటారు. అవి సఫలమైతే ఆనందిస్తారు, విఫలమైతే భగవంతుణ్ణికూడా ద్వేషిస్తారు. ఈ పంచక్లేశములు మానవుణ్ణి బంధితుని గావిస్తున్నాయి. తురీయావస్థలోనే మానవునికి ఆనందం లభ్యమౌతుంది. ఇట్టి పారమార్థిక తత్త్వాన్ని గుర్తించాలనుకుంటే మనస్సును నిర్మూలించుకోవాలి లేక అదుపులో ఉంచుకోవాలి. క్రమక్రమేణ దేహాభిమానమును తగ్గించుకోవాలి.

దేహము పాంచ భౌతికము, దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు, గణుతింపగ దేహికి చావు పుట్టుకల్
మోహనిబంధ బంధనల ముద్రలు లేవు, నిజంబు జూడ యీ దేహియె దేవదేవుడు
మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!

దేహాభిమానమున్నంతవరకు దేహితత్త్వం ఏమాత్రము అర్థంకాదు. పారమార్థిక మార్గానికి దేహాభిమానం నిరంతరం అడ్డు తగులుతుంటుంది. ఏవిధంగానైతే విత్తనంలో వృక్షము రసస్వరూపమై దాగియుందో అదేవిధంగా, సకల క్లేశములూ దేహాభిమానంలోనే అతి సూక్ష్మంగా

sri sathyasai vachanamrutam

దాగియున్నాయి. మానవులు అనుభవించే అశాంతికి, అసంతృప్తికి, కష్టములకు, దుఃఖములకు దేహాభిమానమే మూలకారణం. దేహాన్ని ఒక పనిముట్టుగా భావించి, దేహిని లక్ష్యంలో ఉంచుకొని నిత్య జీవితాన్ని గడపాలి.

**మూలాధార తత్త్వం**

ప్రతి వస్తువుకు ఒక మూలాధార పదార్థమున్నది. ఈ జగత్తంతా ఒక మూలాధారమునుండియే ఏర్పడినది. ఆ మూలాధారమును వదలితే మీరు సర్వమును కోల్పోయినవారవుతారు. ఇది ఒక వెండి చెంబు. ఈ రూప నామములన్నీ మూలధారమైన వెండినుండి ప్రారంభమైనవే కదా! మూలాధారమైన వెండిని విసర్జిస్తే ఈ రూపనామములకు ఏమాత్రం విలువ లేదు. ప్లేటును చెడగొట్టి స్పూనుగా మార్చుకోవచ్చు. స్పూనును చెడగొట్టి చిన్న కప్పును తయారుచేసుకోవచ్చు. కాబట్టి, రూపనామములన్నీ మార్పు చెందునవే, మరణించునవే! కాని, రూపనామములకు మూలాధారమైన వస్తువు ఏనాటికీ మార్పు చెందదు. మరణించదు.

చావు, పుట్టుక లేనట్టి శాశ్వతుండు
ఆది మధ్యాంతరహితు డనాదివాడు
తాను పుట్టక చావక చంపబడక
ఆత్మరూపుడై అంతట వెలసియుండు

దేహమునకు, ప్రాణమునకు, మనస్సుకు మూలాధారమేమిటి? అన్నింటికీ ఒక్క దివ్యత్వమే మూలాధారం. సూర్యరశ్మిచేత సముద్రజలం ఆవిరిగా మారుతున్నది. ఆవిరి మేఘములుగా రూపొంది, ఆ మేఘములపై చల్లని గాలి వీచినప్పుడు అవి వర్ష బిందువులుగా క్రిందికి రాలుతున్నాయి. ఆ వర్ష బిందువులే ప్రవాహాలుగా రూపొంది తిరిగి సముద్రంలో కలసిపోతున్నాయి. అనగా సముద్ర జలం ఇన్ని రూపనామములను ధరించి కట్టకడపటికి తిరిగి సముద్రంలోనే కలిసిపోతున్నదన్నమాట.

అదేవిధంగా ఈ జగత్తులోని ప్రతిప్రాణి, ప్రతి వస్తువు ఒకే మూలాధార తత్త్వంనుండి ఏర్పడినవి. కట్టకడపటికి అవన్నీ మూలాధార తత్త్వంలోనే చేరిపోవాలి. దీనిని పురస్కరించుకొనియే

srisathyasaivachanamrutam

భాగవతం "ఎచ్చట పుట్టె నచ్చటి కేగుట నైజము ప్రాణికోటికిన్" అన్నది. దీనికే వేదాంతం 'ముక్తి' అని పేరు పెట్టింది.

**ఏకత్వాన్ని విశ్వసించటమే ఆధ్యాత్మికం**

ప్రేమస్వరూపులారా! ఆధ్యాత్మికమనగా ఒంటరితనమని, లేక ఏకాకి జీవితమని భావించరాదు. రాగ, ద్వేషములను వీడి విశ్వమానవకోటియొక్క ఏకత్వాన్ని పరిపూర్ణంగా విశ్వసించటమే నిజమైన ఆధ్యాత్మికం. సర్వ జీవుల ఏకత్వమే ఆత్మతత్త్వం. ఆత్మయొక్క రూపమేమిటి? చక్కెర రూపమేమిటని అడిగితే, అది తెల్లగా ఉంటుందని, ఇసుకవలె ఉంటుందని వర్ణించవచ్చునుగాని, తీపి రూపాన్ని ఎవరు వర్ణించగలరు? అది అనుభూతికి మాత్రమే తెలుస్తుంది. దాని రూపాన్ని వర్ణించటం ఎవరి తరమూ కాదు. అదేరీతిగా ఆత్మతత్త్వం కూడా అనుభూతికి మాత్రమే అర్థమౌతుంది; దాని రూపాన్ని ఎవరూ నిర్ణయించలేరు. లోకరీతిగా చూసినప్పుడు మైసూర్ పాక్, గులాబ్ జామ్, బర్ఫీ, పాలకోవా మున్నగు స్వీట్ల రూపనామములు వేరువేరుగా ఉన్నప్పటికీ వాటన్నింటియందున్నది చక్కెర ఒక్కటే కదా! అదేరీతిగా, ఈ జగత్తులో మన కంటికి గోచరించే రూపనామములు వేరువేరుగా ఉన్నప్పటికీ అన్నింటియందున్న ఆత్మతత్త్వం ఒక్కటే.

**మనస్సు పవిత్రంగా ఉండటం ప్రధానం**

జాగ్రదవస్థలో ఉన్న స్థూల శరీరానికి 'విశ్వుడు' అని, స్వప్నావస్థలో ఉన్న సూక్ష్మశరీరానికి 'తైజసుడు' అని పేర్లు పెట్టారు. జాగ్రదవస్థలో అనుభవించిన అనుభూతులన్నీ సంస్కార రూపంలో అంతఃకరణలో లీనమైపోతుంటాయి. తేజోవంతమైన సంస్కారంచేత రూపొందిన తత్త్వమే తైజసుడు. ఇంక, సుషుప్త్యవస్థలో ఉన్న కారణ శరీరానికి 'ప్రాజ్ఞుడు' అని పేరు. ఈ జాగ్రత్స్వప్నసుషుప్త్యవస్థలకు అతీతమైన తురీయావస్థలో ఉన్న ఆనందమే పారమార్థికము. ఈనాటి మానవుడు ఏ సాధనలు చేసినా కేవలం బాహ్యతృప్తికోసం చేస్తున్నాడు. చావడి అయితేనేమి, సత్రమైతే నేమి, నిద్ర వస్తే చాలన్నట్లు, ఏ సాధనలు చేసినప్పటికీ మనస్సు పవిత్రంగా ఉండటం ప్రధానం. మనస్సు పవిత్రంగా ఉండాలంటే ప్రేమను అభివృద్ధి పర్చుకోవాలి. కాగడాలు, కట్టుజ్యోతులు సత్యనిత్యమైన శాంతిని చూపించలేవు; 'ఝుం' అని గాలి వీచిన తక్షణమే అవి ఆరిపోతాయి. కాని, గాలికి ఆరని జ్యోతి ఒకటున్నది. అదియే

sri sathyasai vahini vachanamrutam

ప్రేమజ్యోతి. అట్టి ప్రేమజ్యోతిని మీలో వెలిగించుకోవాలి; మీరు ప్రేమమయులు కావాలి. ప్రేమ నొక్కదానిని మీరు అభివృద్ధి పర్చుకున్నప్పుడే జాగ్రత్స్వప్నసుషుప్తులకు అతీతమైన తురీయావస్థలో ఆనందాన్ని అనుభవించగలరు.

**నిజమైన జాగరణ**

ఈనాడు మనం శివరాత్రి పర్వదినమును జరుపుకుంటున్నాము. మనం ఎన్నో రాత్రులు గడుపుతున్నాము కదా! మరి దీనికి మాత్రమే శివరాత్రి అనే పేరు ప్రత్యేకంగా ఎందుకు పెట్టాలి? మనస్సుకు పదహారు కళలున్నాయి. ఈ దినమున పదిహేను కళలు లీనమై ఒక్క కళ మాత్రమే మిగిలి ఉంటుంది. కనుక ఈ రాత్రంతా మీరు హృదయపూర్వకంగా దైవనామాన్ని స్మరిస్తే ఆ మిగిలిన ఒక్క కళ కూడా దైవంలో లీనమైపోతుంది. చాలమంది శివరాత్రినాడు జాగరణ చేయాలని మూడు, నాల్గు సినిమాలకు పోతుంటారు; లేకపోతే రాత్రంతా కూర్చుని పేకాటాడుతుంటారు. ఇలాంటిది జాగరణ ఎలా అవుతుంది? శివరాత్రి అనగా మంగళకరమైన రాత్రి. ఈ మంగళకరమైన రాత్రిని మంగళకరమైన నామంతోనే గడపాలి. హృదయపూర్వకంగా ప్రేమతో దైవనామాన్ని స్మరించాలి. Source (హృదయం) నుండి స్మరించాలిగాని, Force (బలవంతం) తో కాదు. ఈనాడు చాలమంది ఏదో బలవంతంమీద జాగరణ చేస్తున్నారేగాని, హృదయపూర్వకంగా చేయటంలేదు. అలాంటి జాగరణవల్ల ప్రయోజనం లేదు. హృదయపూర్వకంగా దైవాన్ని అరనిమిషం స్మరించినా చాలు. గంగిగోవు పాలు గరిటెడైనను చాలు, కడివెడైననేమి ఖరము పాలు? భగవంతుడు భావప్రియుడేగాని, బాహ్యప్రియుడు కాదు.

**ప్రాతిభాసిక తత్త్వం**

మొట్టమొదట మీరు భౌతికమైన అన్నమయ కోశమునుండి ప్రాణమయ కోశములోనికి, ప్రాణమయ కోశమునుండి మనోమయ కోశములోనికి ప్రవేశించాలి. ప్రాణమయమునే Vibration అన్నారు. సర్వత్ర వ్యాపించిన తత్త్వమే మనోమయ కోశము. కనుకనే, 'మనోమూల మిదం జగత్' అన్నారు. మనస్సు లేకుండా మనం ఏ పనీ చేయలేము. మనస్సు క్షణంలో అమెరికాకు వెళ్ళవచ్చు. ఇంకెంత దూరమైనా ప్రయాణించవచ్చు. మనిషికి మరణముందిగాని, మనస్సుకు మరణం లేదు. ఎన్ని జన్మలెత్తినప్పటికీ మనస్సు వెంట వస్తూనే ఉంటుంది. నాల్గవది

sri sathyasai vahamrutam

విజ్ఞానమయ కోశము. ఈ విజ్ఞానము సైన్సుకు, అనగా పదార్థ శాస్త్రమునకు సంబంధించినది కాదు. పదార్థ శాస్త్రంలో ప్రతిబింబమనేది వెలుగుతూ ఉంటుంది. కనుకనే దీనిని 'ప్రాతిభాసికము' అన్నారు. ఒక చిన్న ఉదాహరణ. నీకు కోపం వచ్చి నీ ఎదురుగా ఉన్న టేబుల్‌ని గట్టిగా కొట్టావు. 'నేను టేబుల్‌ని గట్టిగా కొట్టాను' అని నీ ప్రతాపాన్ని మాత్రమే చెప్పుకుంటావు. కాని నిజానికి నీవు టేబుల్‌ని కొట్టినప్పుడు అది కూడా నిన్ను కొట్టింది. కనుకనే, నీ చేయికి కూడా నొప్పి కల్గింది. ఇదే ప్రాతిభాసిక తత్త్వం. ఇందులో ప్రతిదానికి రియాక్షన్, రీసౌండ్, రిఫ్లెక్షన్ (ప్రతిచర్య, ప్రతిధ్వని, ప్రతిబింబము) ఉంటాయి. కాబట్టి దీనికి సంబంధించినది లౌకిక జ్ఞానమేగాని, విజ్ఞానము కానేరదు. నిజమైన విజ్ఞానము Constant Integrated Awarness కు సంబంధించినది. తద్వారా లభించే ఆనందము మార్పు చెందనిది. అది పంచకోశములలోనుండే ఆనందము కాదు.

అన్నమయ కోశము స్థూల స్వరూపం; ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశములు మూడూ చేరినది సూక్ష్మస్వరూపం. ఆనందమయ కోశము కారణస్వరూపం. తురీయావస్థ వీటన్నింటికీ అతీతమైనది. అది మహాకారణ స్వరూపం. కారణమునకు అతీతమైనది మహాకారణం. అలాంటి తత్త్వాన్ని మీరు తెలుసుకోవాలంటే పంచకోశముల తత్త్వాన్ని అర్థం చేసుకోవాలి. ఈ కోశములన్నీ కేవలం ఆత్మను పట్టుకొని ఆడుతున్నవేగాని, నిజంగా ఆత్మకు కోశములకు సంబంధం లేదు. కాని, మీరు ఆత్మవరకు ప్రయాణించకుండా కేవలం దేహమును మాత్రమే దృష్టియందుంచుకొని అంతా దేహమే చేస్తున్నదని భావిస్తున్నారు. దేహము ఒక పనిముట్టు మాత్రమే.

**చావు లేని చదువు చదువవలయు**

విద్యార్థుల్లారా! మీరీ చదువులు దేనికోసం చదువుతున్నారు? దేహాభిమానంచేతనే చదువుతున్నారు. చదువుద్వారా ధనాన్ని సంపాదించాలని, సుఖాన్ని అనుభవించాలని ఆశిస్తున్నారు. కాని, మీరు ఆశించే సుఖం చదువులోగాని, ధనంలోగాని లేదు. చదువులో ఉత్తీర్ణులైనప్పుడు మీకు ఆనందం కల్గుతుంది. కాని ఆ ఆనందం ఎంతవరకు? ఉద్యోగంలో చేరేంతవరకే ఉంటుంది. ఉద్యోగంలో చేరిన తరువాత ప్రమోషన్ రాలేదే అని దుఃఖం

ప్రారంభమౌతుంది. ఈవిధంగా విచారణ చేస్తే, ఈ లౌకిక విషయాలలో ఆనందం లేదని స్పష్టమౌతుంది. తురీయావస్థయందే శాశ్వతానందం ప్రాప్తిస్తుంది.

విద్యార్థులారా! ఈ లౌకికమైన భోగభాగ్యాలన్నీ కదలిపోయే మేఘాలవంటివి. ప్రేమ ఒక్కటే శాశ్వతమైనది. ప్రేమయే దైవం. కనుక ప్రేమలో జీవించండి. యౌవనం చాల పవిత్రమైనది. కాని, మీరు మితిమీరిన ఆశలతో దానిని పాడుచేసుకుంటున్నారు; అనవసరమైన కార్యాలలో పాల్గొని, అనవసరమైన బంధనలో చిక్కుకుని చిక్కులకు గురియౌతున్నారు. ఒక్క క్షణమైనా మీ మనస్సుకు శాంతిలేదు. శాంతి ఎక్కడి నుండి వస్తుంది? శాంతి ప్రపంచంలో చిక్కేది కాదు. శాంతి మీయందే ఉన్నది. మీరే శాంతిస్వరూపులు. కాబట్టి మొట్టమొదట మిమ్మల్ని మీరు తెలుసుకోండి. అప్పుడే మీకు ఆనందం ప్రాప్తిస్తుంది.

చదువులన్ని చదివి చాల వివేకియై
మదిని తన్నెఱుగడు మందమతుడు
ఎంత చదువు చదివి ఏరీతి నున్నను
హీను డవగుణంబు మానలేడు!
తరచి చదువు చదువ తర్కవాదమెకాని
పూర్ణ జ్ఞాన మెపుడు పొందలేడు
చదువులన్నియు చదివి చావంగ నేటికి?
చావులేని చదువు చదువవలయు!

లౌకికమైన చదువులతోపాటు ఆధ్యాత్మిక చదువుకూడ ఉండాలి. లౌకికమైనవన్నీ మారిపోయేటువంటివి. దైవత్వమొక్కటే శాశ్వతమైనది. కాని, ఈనాటి మనుష్యులు దైవత్వాన్ని విస్మరించి, లోకాన్ని విశ్వసించి అనేక ప్లాన్లు వేస్తుంటారు. అదే పెద్ద అజ్ఞానం.

ఒకానొక సమయంలో శంకరులవారు తన పదమూడుమంది శిష్యులతో గంగా స్నానమునకు వెళుతున్నప్పుడు మార్గమధ్యంలో ఒక చెట్టు క్రింద ఒక బ్రాహ్మణుడు కూర్చుని "డుకృఞ్ కరణే, డుకృఞ్ కరణే..." అని పాణిని వ్యాకరణ సూత్రాన్ని వల్లించటం చూశారు; అతనివద్దకువెళ్ళి "నాయనా! దీనివల్ల నీకు కలిగే సుఖం ఏమిటి?" అని అడిగారు. "అయ్యా! నేను గొప్ప పండితుడనై మహారాజును ఆశ్రయించి బాగా ధనం సంపాదిస్తాను" అన్నాడా

sri sathyasai vahini.org

వ్యక్తి. "ఆ ధనం నీకు ఎంతవరకు ఆనందాన్నిస్తుంది?" అని ప్రశ్నించారు శంకరులవారు. "చచ్చేంతవరకు ఆనందాన్నిస్తుంది" అన్నాడా వ్యక్తి. "చచ్చిన తరువాత ఏమౌతుంది?" అని ప్రశ్నించగా, ఆ వ్యక్తి తనకు తెలియదన్నాడు. అప్పుడు శంకరుల వారు

భజ గోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే
సంప్రాప్తే సన్నిహితే కాలే
నహి నహి రక్షతి డుకృఞ్ కరణే

"పిచ్చివాడా! భగవంతుని నామాన్ని స్మరించు. అదే నిన్ను సర్వకాల సర్వావస్థలయందు రక్షిస్తుంది" అని బోధించారు.

**దేహం ఒక తోలుబొమ్మ**

విద్యార్థులారా! ఈ లౌకిక విద్యలందు మీరు ఉత్తీర్ణులు కావాలి. అయితే "అధ్యాత్మ విద్యా విద్యానాం" సంపూర్ణమైన తత్త్వం ఆత్మవిద్యయే! మీరు గొప్ప గొప్ప పదవులు ఏలవచ్చు. కాని, అవన్నీ ఎంతకాలం? మీ అందచందము లెంతకాలం? అన్నీ కొంతకాలమే!

అందము ప్రాయము ఇంద్రియ శక్తియు
ఉందని నిక్కకురోరన్నా!
ముందున్నదిరా తొందరలోనే
ముసలితనమ్మను ముసళ్ళ పండుగ
మసలలేవు, కనుమసకలు, మోమున
ముడతలుబడె, తల నెరిసెనుగా
ముసలి కోతియని పసివారలు నిన్
ముసిముసి నవ్వగ కసరే బొమ్మా!
తై తై తై తై తై బొమ్మా!
దీని తమాషా జూడర మాయబొమ్మా!

ఈ దేహం ఒక తోలుబొమ్మ. ఎంతకాలం మీ యౌవనం? ఎంతకాలం మీ ఇంద్రియ పటుత్వం? ఎంతోకాలం ఉండవు. మెరుపు మెరిసినప్పుడు గొప్ప వెలుతురు వస్తుందిగాని,

sri sathyasai vachanamrutam

మరుక్షణంలోనే దట్టమైన చీకటి క్రమ్ముకుంటుంది. ఉదయం వికసించిన పూవు సాయంకాలానికి వాడిపోతుంది. అదే రీతిగా, దేహంకూడా యౌవనంనుండి వార్ధక్యంలోకి ప్రవేశిస్తుంది. ఇట్టి శరీర తత్త్వాన్ని మీరు అర్థం చేసుకోవాలి.

## స్వామి ఆదర్శం

విద్యార్థుల్లారా! మీ దేహాన్ని, మనస్సును అదుపులో పెట్టుకోండి; ఇంద్రియాలను నిగ్రహించుకోండి. అప్పుడు మీరు నిరంతరము యువకులుగానే ఉంటారు. దీనికి నేనే ప్రత్యక్ష ప్రమాణం. ఈ దేహంయొక్క వయస్సు 75 సంవత్సరాలని ఎవరైనా ఊహించగలరా? నాకు టైం లేదుగాని, ఇప్పటికీ చక్కగా పరుగెత్తగలను. నాలో అన్ని శక్తులూ ఉన్నాయి; ఎలాంటి బలహీనతలూ లేవు. దీనికి కారణమేమిటి?నాలో Purity, Patience, Perseverance. (పవిత్రత, సహనం, పట్టుదల) మూడూ ఉన్నాయి; పవిత్రమైన, నిర్మలమైన నిశ్చలమైన భావాలున్నాయి. మీరుకూడ ఇలాంటి భావాలను అభివృద్ధి పర్చుకోండి. మీరు స్వామి భక్తులమని చెప్పుకుంటారు కదా! మరి స్వామిలో నున్న పవిత్రతలో కనీసం వేయింట ఒక భాగమైనా మీలో చేర్చుకోవద్దా? పవిత్రతోపాటు మీరు శాంతమునుకూడా పోషించుకోవాలి. ఎదుటివారు ఏదైనా అడిగితే శాంతంగా జవాబు చెప్పాలి. నన్ను చూడండి. ఎంతమంది వచ్చినా అందరితో మాట్లాడుతూ ఎల్లప్పుడు శాంతంగా ఉంటాను. నాకు కేవలం ఒక్క పనికాదు, ఎన్నో పనులున్నాయి. నాయొక్క ఆఫీసు ఫలానా అని, నా డిపార్టుమెంటు ఫలానా అని చెప్పటానికి వీలుకాదు. అన్ని డిపార్టుమెంట్లూ నావే! నాకు విశ్రాంతి అనేదే లేదు. అయినప్పటికీ నేనెప్పుడూ ఆనందంగానే ఉంటాను. (Iam always blissful)

పుట్టినరోజున కొంతమంది 'స్వామీ! హేపీ బర్త్ డే' అంటారు. కాని నెనెప్పుడూ 'హేపీ' (ఆనందం) గానే ఉన్నాను. ఆనందంగా లేనివారికి ఆనందాన్ని అందించండి. భగవంతునితో చేరికయే ఆనందము. కనుక, నిరంతరము భగవంతుడు మీ ఇంటనే, వెంటనే, జంటనే ఉన్నాడని దృఢంగా విశ్వసించండి. అప్పుడు మీకు దుఃఖంగాని, విచారం గాని కల్గడానికి వీలే లేదు. మీరు విచారమంటారు, దుఃఖమంటారు. అవి ఎలా ఉంటాయో చూడాలని నాకు ఆశగా ఉంటుంది. కాని అవి నా దగ్గరకే రావు. కారణమేమిటి? పవిత్రత ఉన్న చోటికి అవి

sri sathyasai vachanamrutam

రానేరావు. ఎక్కడ దుర్గుణములు, దురాలోచనలు, దురాచారములు ఉంటాయో అక్కడే దుఃఖం, విచారము తాండవ మాడుతుంటాయి. కనుక, చెడును చూడకండి. మంచినే వినండి; చెడును మాట్లాడకండి, మంచినే మాట్లాడండి; చెడును తలచకండి, మంచినే తలచండి; చెడును చేయకండి, మంచినే చేయండి. దివ్యత్వానికి ఇదే రాజమార్గం.

**విశ్వాసము - అనుగ్రహము**

ఏది జరిగినా మీ మంచికే అని భావించండి. కొద్దిసేపటి క్రిందట ఈ వేదికపై స్వామి ఒక వ్యక్తితో మాట్లాడటం మీరు చూశారు కదా! ఆ వ్యక్తి పేరు నారాయణ. అతను మద్రాసు నుండి వచ్చాడు. అతనికి క్రిందటి వారం గుండెపోటు వచ్చింది. అతని కుమారుడు మా కాలేజీలో చదువుతున్నాడు. ఆ అబ్బాయి తండ్రికి ఫోను చేసి "మీరు వేరే డాక్టర్లవద్దకు వెళ్ళవద్దు. తక్షణమే బయలుదేరి పుట్టపర్తికి రండి" అని చెప్పాడు. అతడు ఇక్కడికి వచ్చిన తరువాత డాక్టర్లు పరిశీలించి, గుండెయొక్క నాల్గు వాల్వులు పూడుకొనిపోయాయని, ఆపరేషన్ చేయటం కూడా కష్టమేనని అన్నారు. అమెరికానుండి ముగ్గురు డాక్టర్లు వచ్చారు. అన్ని వైపులనుండి రక్తప్రసరణ నిల్చిపోయినప్పటికీ ఇతను ఇంకా ఎలా బ్రతికియున్నాడని ఆశ్చర్యపోయారు. "నారాయణగారూ! మీకిప్పుడు ఎలా ఉంది?" అని అడిగితే "నాకు ఏమాత్రము నొప్పి లేదు. ఆనందంగా ఉన్నాను. స్వామి నా వెంటనే ఉన్నారు. కాబట్టి నాకు ఏమాత్రము బాధలేదు" అన్నాడు. కాని, డాక్టర్లకు తృప్తి కల్గలేదు.

మొన్న ఉదయం ఎనిమిది గంటలకు ఆపరేషన్ థియేటర్‌కు తీసుకు వెళ్లారు; ఒక గంట కాదు, రెండు గంటలు కాదు, ఐదు గంటలు ఆపరేషన్ చేశారు. మొత్తం నాల్గు 'బైపాస్' లు చేశారు. మొన్న ఆపరేషన్ జరిగితే ఈ రోజు ఇక్కడికి వచ్చాడు చూడండి! సాధారణంగా ఇలాంటి ఆపరేషన్ తరువాత ఏ ఆసుపత్రిలోనైన కనీసం పది దినములు బెడ్‌పైన ఉండాలి. కాని ఇతను నిన్నటి దినమే లేచి కూర్చున్నాడు. డాక్టర్లు ఇడ్లీలు పెడితే చక్కగా భుజించాడు. నిన్న సాయంకాలం మూడు వందల అడుగులు నడిచాడు. ఇప్పుడిక్కడికి ప్యాంటు, షర్టు వేసుకుని 'కాలేజి బాయ్' మాదిరి వచ్చాడు. నేను చూసి చాల ఆనందించాను. "దీనికంతటికీ నీ విశ్వాసమే మూలకారణం" అని చెప్పాను.

srisathyasaivachanamrutam

అతడు ఇక్కడికి వచ్చినప్పటినుండి అంతా స్వామియే చూసుకుంటారని స్వామిపైన భారం వేసి నిశ్చింతగా ఉన్నాడు. Swamy is with me always (స్వామి నిరంతరం నావెంటనే ఉన్నారు) అని దృఢంగా విశ్వసించాడు. ఈ గుండె జబ్బు రావటంకూడా తన మంచికే జరిగిందని, దానివల్లనే తాను స్వామి సన్నిధికి రాగల్గానని అన్నాడు. అంతేకాదు. ఈ ఆసుపత్రి సాధారణ ఆసుపత్రి కాదు, ఇది ఆరోగ్య మందిరం అన్నాడు. లేకపోతే అంత పెద్ద ఆపరేషన్ జరిగిన రెండు రోజుల్లోనే ఇక్కడికి ఎలా రాగలడు? "మొన్న ఆపరేషన్ జరిగింది, నిన్న ఇడ్లీలు తిన్నాడు. ఈ పొద్దు ఇక్కడికి వచ్చాడు. ఇది సాధ్యమేనా?" అని ఏ డాక్టరునైనా ప్రశ్నించండి. ఇది అసాధ్యం అని చెపుతారు. ఎందుకంటే, శరీర తత్త్వం అలాంటిది. కాని భగవంతుణ్ణి దృఢంగా విశ్వసిస్తే దేనినైనా మార్చుకోవచ్చు; అవసరమైతే భూమిని ఆకాశంగా, ఆకాశాన్ని భూమిగా మార్చుకోవచ్చు.

అయితే ముఖ్యంగా నమ్మకం ఉండాలి. కాని, ఈనాడు "నమ్మకమను రెండు నయనమ్ములే లేని అంధులైరి జనులు అవనియందు" ఈనాటి మనిషి తనను తానే నమ్మడు. ఇంక దైవాన్ని ఏ రీతిగా నమ్మగలడు? తనను తాను తెలుసుకోలేనివాడు దైవాన్ని ఏరీతిగా తెలుసుకోగలడు? మొట్టమొదట తనను తాను తెలుసుకోవాలి. అప్పుడే దైవత్వం సులభంగా అర్థమౌతుంది. దైవాన్ని దృఢంగా విశ్వసించండి. దైవం చేయలేనటువంటిది ఈ లోకంలో ఏదీ లేదు. నాస్తికులకు అనుభవం లేకపోవటంచేత వారు దైవం లేదని వాదిస్తుంటారు. కన్నులున్నవానికి చిన్న మిణుగురు పురుగైనా కనిపిస్తుంది. కన్నులులేని వానికి సూర్యోదయమైనా చీకటిగానే ఉంటుంది. అదేవిధంగా ఆధ్యాత్మిక నేత్రం లేనివానికి జీవితమంతా చీకటిగానే ఉంటుంది.

ప్రేమ ఎంత పెరిగితే అంత సుఖం

ఇది కలియుగమన్నారు. కాని ఇది కలియుగం కాదు, కలహయుగం! ఇంట్లో జగడం, బజార్లో జగడం, ఎక్కడ చూసినా జగడమే! ప్రతి దానికి జగడమే! ఈ అశాంతిని దూరం చేయటానికి విద్యార్థులు కంకణం కట్టుకోవాలి. క్రోధాన్ని అసూయను చంపివేయాలి. ద్వేషాన్ని పూడ్చిపెట్టాలి. ప్రేమతత్త్వం చేత అందరినీ కలపాలి. అందరినీ ప్రేమించండి. అప్పుడు మీకు ద్వేషులే ఉండరు. నేను అందరినీ ప్రేమిస్తున్నాను. కనుక నాకు ద్వేషులే లేరు; నేను ఎవ్వరికీ

sri sathyasai vahini amrutam

ద్వేషిని కాను. కొంతమంది స్వామికి తమపై కోపం వచ్చిందని, స్వామి తమతో మాట్లాడటం లేదని భావిస్తుంటారు.కాని నాకు ఎవరిపైనా కోపం లేదు. అయితే ఒక్కొక్క పర్యాయం మిమ్మల్ని సరిదిద్దేకోసం కొన్ని దినములు నేను మీతో మాట్లాడకుండా ఉంటాను.

జబ్బు వస్తే మందు ఇవ్వాలి., మందుతోపాటు పథ్యం కూడా పెట్టాలి. అదేవిధంగా, మీలో మానసిక పరివర్తన తెప్పించే నిమిత్తం కొన్ని కొన్ని పర్యాయములు నేను గతిరిలిశి (మౌనం) గా ఉంటాను. క్రోధమునకు, ద్వేషమునకు అవకాశమివ్వకండి. క్రోధం పెరగకూడదు, ప్రేమ పెరగాలి. ప్రేమ ఎంత పెరుగుతుందో మీరంత సుఖాన్ని పొందుతారు; ఆనందానికి అంత సమీపులౌతారు. దైవంపైనే క్రోధమును పెంచుకున్న హిరణ్యకశిపునికి, రావణునికి, దుర్యోధనునికి కట్టకడపటికి ఏ గతి పట్టిందో మీకు తెలుసు. ప్రేమను పెంచుకున్న పాండవులు మాత్రం సుక్షేమాన్ని పొందారు. ఎన్ని కష్టములు కల్గినాయి వారికి! కాని వారికి భగవంతునిపై గల ప్రేమయే అన్ని వేళల వారిని సంరక్షిస్తూ వచ్చింది. కనుక, భగవంతుణ్ణి ప్రేమించండి. అప్పుడే మీరు సుఖశాంతులను అనుభవించగలరు.

(4.3.2000 సాయంత్రం సాయికుల్వంత్ సభా మండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశం)

sri sathyasai vachanamrutam